## క్లుప్తంగా

### నేడు భావనపాడులో మెగా రక్తదాన శిబిరం

వజ్రపుకొత్తూరు రూరల్: భావనపాడులో ఆ నలుగురు ట్రస్ట్ ఆధ్వర్యంలో యువత సాకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ప్రతినిధి సానా ఈశ్వరరావు ఆదివారం తెలిపారు. ట్రస్ట్ సౌజన్యంతో ఎంతో మంది బాధితులకు అత్యవసర పరిస్థితిలో రక్తదానం చేసి ప్రాణాలను నిలబెడుతున్నామన్నారు. యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

### మైనర్లు డ్రైవింగ్ చేస్తే చర్యలు



మైనర్లను హెచ్చరిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణ

ఇచ్ఛాపురం రూరల్: మైనర్లు ద్విచక్ర వాహనాలు డ్రైవింగ్ చేస్తే వారితోపాటు తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్‌ఐ ఎన్.లక్ష్మణ హెచ్చరించారు. ఈదుపురం, మండపల్లి కూడళ్లలో ద్విచక్ర వాహనాలను ఆదివారం తనిఖీ చేశారు. విధిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించి అన్ని పత్రాలు ఉండాలని సూచించారు. అనంతరం వాహనచోదకులచే రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.

### హెల్మెట్ వినియోగంపై అవగాహన



వాహనదారులతో మాట్లాడుతున్న పట్టణ ఎస్సై సత్యన్నారాయణ

ఇచ్ఛాపురం: ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పని సరిగా హెల్మెట్‌లను ధరించి ప్రయాణాలు చేయాలని పట్టణ ఎస్సై వి.సత్యన్నారాయణ సూచించారు. మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్‌లు లేకుండా వాహనాలను నడుపుతున్న వారిని నిలిపి మాట్లాడారు. హెల్మెట్ ప్రాధాన్యతను, ట్రాఫిక నిబంధనలను వివరించారు.

### పలాసపురంలో జంగిల్ క్లియరెన్స్



కోనేరులో పూడిక తీయిస్తున్న సర్పంచ్ జోగారావు

సోంపేట: సోంపేట మండలం పలాసపురంలో సర్పంచ్ తడక జోగారావు అధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్ పనులను ఆదివారం చెప్పారు. పలాసపురం మెయిన్ రోడ్ నుంచి పాఠశాలల పరిసరాలు, పాఠశాల వెనుకవీధి, దేవాలయం పరిసర ప్రాంతాల్లో పెరిగిపోయిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను, కోనేరులో పేరుకుపోయిన పూడికలను జేసీబీతో తొలగించారు.

### పోలారావు సేవలు మరువలేనివి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ అభివృద్ధితో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ దివంగత పిలక పోలారావు చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. బెల్లుపడ గ్రామంలో పోలారావు జయంతి కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులైన మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, సంతోష్, ఆశి సత్యవతి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలారావు విగ్రహానికి ఎమ్మెల్సీ రామారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.పోలారావుతో వారికున్న సన్నిహితంతో పాటు కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సల్లా సుగుణ, పార్టీ నాయకులు తాడి ఆదిరెడ్డి, ప్రత్తి అన్వేష్, సల్లా దేవరాజు, పిలక యాదవరావు, పరపటి కోటిరెడ్డి, ఎ.శ్రీను, ప్రకాశరావు పట్నాయక్ పాల్గొన్నారు.

### మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

కాశీబుగ్గ: మందస మండలం భైరిసారంగపురం పంచాయతీ రాధాకృష్ణపురం గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మిగులు సీట్లను భర్తీ చేసేందుకు అర్హులైనవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 5వ తరగతి ఎస్సీ కేటగిరీలో 46, 6వ తరగతి ఎస్సీ కేటగిరీలో 47, ఓసీ కేటగిరీలో ఒకటి, ఏడో తరగతిలో ఎస్సీ కేటగిరీలో 39 సీట్లు, 8వతరగతి ఎస్సీ కేటగిరీలో 40, 9వ తరగతిలో ఎస్సీ కేటగిరీలో 45 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఎస్సీ కేటగిరీలో 21, ఓసీ కేటగిరీలో ఒకటి, బైపీసీ ఎస్సీ కేటగిరీలో ఒకటి, బీసీ కేటగిరీలో ఒక సీటు ఖాళీగా ఉన్నటుట పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఈ నెల 13వ తేదీన ఉదయం పది గంటలకు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాఠశాల పని వేళల్లో హాజరు కావాలని కోరారు.

## బాధ్యతల స్వీకరణ



కోటబొమ్మాళి మండల విద్యాశాధికారి-1 (ఇన్‌చార్జి-ఎఫ్‌ఏసీ)గా చందక గోవింద ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం కొత్తూరు ఎంఈవోగా వ్యవహరిస్తూనే కోటబొమ్మాళి బాధ్యతలు కూడా నిర్వహించనున్నారు. ఇప్పటివరకూ ఇక్కడ పని చేసిన ఎస్.అప్పలరాజు జూలై 31న ఉద్యోగ విరమణ చేశారు. బాధ్యతలు స్వీకరించిన గోవిందను ఎంఈవో-2 ఎల్.వి.ప్రతాప్, ఉపాధ్యాయులు గొండు నారాయణరావు, యర్లాగుల వాసుదేవరావు, మెండ గోవిందరావు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

-కోటబొమ్మాళి

## అపూర్వ కలయిక



నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-91 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం, ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరిని ఒకరు తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనాటి గురువులైన జినగ ఆదినారాయణ, పసుపుల కృష్ణారావు, వెంకటేశ్వరరావు, రామానుజాచార్యులు, పి.రామకృష్ణారావు, ఈశ్వరరావు, ప్రస్తుత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రామును సత్కరించారు. ఆట పాటలతో సందడి చేసి గ్రూపు ఫొటోలు తీసుకున్నారు. ఆత్మీయ కలయికకు చిన్ని జోగారావు, కూరాకుల యాదవ్, పోలాకి డిల్లేశ్వరరావు, సనపల రమేష్ తదితరులు కృషి చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

- నందిగాం

## మంచినీరు వృథా!



ప్రజల అవసరాలను తీర్చాల్సిన మంచినీరు వృథాగా పోతోంది. పలాస మండలం మామిడిపల్లి గ్రామంలోని ఒక వీధిలో ఉన్న మంచినీటి కుళాయిల నుంచి 24 గంటలూ నీరు ఏకధారగా పోతోంది. కుళాయిల ట్యాపులు పని చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకుంది. నీరు వృథాగా రోడ్లపై పారుతోంది. దీంతో నాచు పేరుకుపోయి పిల్లలు, వృద్ధులు పడిపోయి గాయాలపాలవుతున్నారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి దృష్టికి ఆ వీధి వాసులు తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేదంటున్నారు. నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

-పలాస

# భయపెడుతున్న వంతెన!

- ఏ క్షణంలో కూలుతుందో తెలియని వైనం
- భయం గుప్పెట్లో మత్స్యకారులు



కూలేందుకు సిద్ధంగా ఉన్న డొంకూరు వంతెన

ఇచ్ఛాపురం రూరల్: రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన ఇప్పుడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో జనం భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్ఛాపురం మండలం డొంకూరు, పెద్ద లక్ష్మీపురం, చిన్న లక్ష్మీపురం, శివకృష్ణాపురం మత్స్యకార గ్రామాలకు వెళ్లేందుకు బహుదానది సముద్రంలో కలిసే చోట డొంకూరు వద్ద 2003లో నిర్మించిన వంతెన శిథిలమైంది. సముద్రం గాలికి, ఉప్పుటేరుకు వంతెన పైభాగంతో పాటు దిగువ భాగంలో ఉన్న పిల్లర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని ఇనుప చువ్వలు తుప్పుపట్టి బయటకు కనిపిస్తున్నాయి. వంతెనకు పైభాగంలో ఇరువైపుల ఉన్న సపోర్టులు కూలిపోయాయి. పక్కనే ఒడిశా గ్రామాలు స్వర్ణాపురం బీచ్ ఉండటంతో నిత్యం వందలాది మంది ప్రయాణికులు, వ్యాపారులు, పర్యాటకులు వాహనాలతో ప్రయాణిస్తున్నారు. రాత్రి సమయాల్లో ఏ మాత్రం అజాగ్రత్తగా ప్రయాణిస్తే ఉప్పుటేరులో పడిపోవడం తప్పదని స్థానికులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పిరియా విజయ కృషితో..**

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ కృషి మేరకు గత ఏడాది బూర్జపాడు నుంచి పెద్ద లక్ష్మీపురం వరకు 5.45 కిలోమీటర్ల పొడవున రూ.487 లక్షలతో ప్రధానమంత్రి సడక్ యోజన పథకం ద్వారా రోడ్డు పనులు పూర్తి చేశారు. దశాబ్దాల నుంచి ఈ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ గత ప్రభుత్వాలు రోడ్డు నిర్మాణానికి ముందుకు రాకపోవడంతో పిరియా విజయ ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో పాటు పి.ఎం.జి.ఎస్.వై. పథకం ద్వారా ఈ వంతెన నిర్మాణానికి రూ.6 కోట్ల 30 లక్షలు, బూర్జపాడు ఉప్పుటేరు వద్ద శిథిలావస్థకు చేరుకున్న కాజ్‌వే పైన వంతెన నిర్మాణానికి రూ.10 కోట్ల 50 లక్షలు చొప్పున ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే టెండర్ వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో స్థానికులు నిరాశ చెందారు. మరోమారు టెండర్‌కు పిలవడం, కాంట్రాక్టర్లు ముందుకు వచ్చిన సమయంలో ఎన్నికలు రావడంతో వంతెన నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో రెండు వంతెనలు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వంతెన దిగువ బయటకు వచ్చిన ఇనుప చువ్వలు



శిథిలావస్థకు చేరుకున్న బూర్జపాడు కాజ్‌వే



వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వేసిన తారు రోడ్డు

# మమ్మల్ని ఎవడ్రా ఆపేది!

- నిబంధనలను తుంగలో తొక్కుతున్న వాహన చోదకులు





పలాస ఎమ్మెల్యే తాలూకా అంటూ వాహనానికి ఏర్పాటు చేసిన నంబర్ ప్లేట్





పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా అంటూ నంబర్‌ప్లేట్‌పై ఏర్పాటు చేసిన స్టిక్కర్

వజ్రపుకొత్తూరు: వాహనానికి నంబర్ ప్లేట్ ఎంతో ముఖ్యమైంది. ఈ విషయమై ప్రభుత్వాలు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్‌లను సైతం ప్రవేశ పెట్టింది. వాహనానికి ముందూ.. వెనుకా స్పష్టంగా కనబడేలా చోదకులు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. అయితే చాలా మంది వాహనదారులు నంబర్ ప్లేటుపై నంబర్ కనిపించకుండా ఇష్టం వచ్చిన వాటిని రాసిపెట్టుకుంటున్నారు. మమల్మి ఆపేది ఎవడ్రా అంటూ.. నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మేము ఫలానా ఎమ్మెల్యే తాలూకా.. అంటూ పెద్ద పెద్ద అక్షరాలతో నేతల ఫొటోలనూ నంబర్ ప్లేట్‌లపై వేయించుకుని యథేచ్ఛగా తిరుగుతున్నారు. ఇలాంటి పిచ్చి పనులు వద్దని పోలీసులు అనేక విధాలుగా అవగాహన కల్పిస్తున్నప్పటికీ చాలామందిలో మార్పు రావడం లేదు. నిబంధనలు పాటించకుంటే కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు, రవాణా శాఖ అధికారులు హెచ్చరిస్తున్నా ఫలితం లేకుండా పోతుంది.

# సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు

ఇచ్ఛాపురం రూరల్: సేంద్రియ వ్యవసాయంతో రైతులు అధిక లాభాలను పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి మద్దిలి చిట్టిబాబు అన్నారు. మేగా ఎన్‌పీఎం షాపు దినోత్సవం సందర్భంగా ఆదివారం మశాఖపురం, పాయితారి గ్రామాల్లో నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం కషాయాలు తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఏ పంట సాగు చేసినా రసాయన ఎరువులు, పురుగు మందులపై ఆధారపడాల్సి వస్తోందని అన్నారు. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించేలా కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్పీలు ఎస్.రూప, కుమారి పాల్గొన్నారు.



మశాఖపురంలో నీమాస్త్రంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

# టెక్కలిలో 'రాజ్యరాణి'ని ఆపించండి!

- కేంద్రమంత్రికి ప్రజల విజ్ఞప్తి





టెక్కలి రైల్వే స్టేషన్

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలో రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైల్‌కు హాల్టింగ్ ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రస్తుతం టెక్కలి నియోజకవర్గానికి చెందిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు కేంద్ర మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంత రైల్వే ప్రయాణికుల కోసం టెక్కలిలో రాజ్యరాణి రైలు నిలిపే విధంగా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. రోజూ రూర్కెలా నుంచి టెక్కలి మీదుగా గుణుపూర్ రాకపోకలు సాగిస్తున్న ఈ ట్రైన్ టెక్కలిలో ఆగకపోవడం ఇక్కడ ప్రయాణికులను నిరాశకు గురి చేస్తోంది. టెక్కలి పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలకు రూర్కెలా ఉక్కు పరిశ్రమ ప్రాంతాల్లో ఉన్న వారికి బంధుత్వాలు, తరచూ ఇతర అవసరాలు ఏర్పడుతుంటాయి. ఈ నేపథ్యంలో నేరుగా మరో రైలు లేకపోవడంతో రాజ్యరాణిపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో సమీపంలో నౌపడ రైల్వేస్టేషన్‌కు వెళ్లి అవస్థలు పడాల్సి వస్తోంది. టెక్కలిలో ప్రస్తుతం పూరి-గుణుపూర్, కటక్-గుణుపూర్, విశాఖ-గుణుపూర్ వంటి రైళ్లు ఆగుతున్నాయి. రాజ్యరాణి వంటి ఎక్స్‌ప్రెస్ రైలు ఆగకపోవడంపై నిరాశ చెందుతున్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టి సారించి టెక్కలిలో రాజ్యరాణి రైలు ఆగే విధంగా కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### మృతుల కుటుంబాలకు పరామర్శ

కాశీబుగ్గ: మందస మండలంలోని పలు గ్రామాలలో మాజీ ఎమ్మెల్యే గౌతు శ్యామ్‌సుందర్ శివాజీ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా పిడి మందస, పొత్తంగి, భోగాపురం, మరదమెకో గ్రామాల్లో ఇటీవల చనిపోయిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### యువకుడి రక్తదానం



రక్తదానం చేస్తున్న హేమసుందర్

కాశీబుగ్గ: పట్టణానికి చెందిన 'ఆ నలుగురు' ట్రస్ట్ సభ్యులు ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆదివారం కూడా ఓ గర్భిణికి రక్తం అందించారు. పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి నీలిమ అనే గర్భిణి పురిటి నొప్పులతో వచ్చారు. ఆమెకు అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో ఆ నలుగురు ట్రస్ట్ సభ్యులను సంప్రదించారు. పలాస మండలం తర్లాకోట గ్రామానికి చెందిన హేమసుందర్ రక్తదానం చేసి తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడారు.

### సంపద కేంద్రాలపై నిర్లక్ష్యం?



సంపద కేంద్రం దుస్థితి

ఇచ్ఛాపురం రూరల్: చెత్త నుంచి సంపదను సృష్టించేందుకు ప్రభుత్వం వేలాది రూపాయలు ఖర్చుపెట్టి సంపద కేంద్రాలను నిర్మిస్తే, వాటిని పర్యవేక్షించాల్సిన అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడంతో అవి వినియోగంలోకి లేకుండా పోయాయి. కొళిగాం గ్రామ పంచాయతీలో ఉన్న చెత్త సంపద కేంద్రం నిరుపయోగంగా మిగిలింది. రెండేళ్ల క్రితం వీచిన గాలులకు కేంద్రం పైకప్పు ఎగిరిపోయింది. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. అధికారులు స్పందించి సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు

# ఉత్సాహంగా క్రీడా పోటీలు



కబడ్డీ పోటీలో తలపడుతున్న కొళగాం పాఠశాల విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఆదివారం కొళిగాం, లొద్దపుట్టి ఉన్నత పాఠశాలల్లో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను ఉపాధ్యాయులు నిర్వహించారు.

# కార్మికుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న అధ్యక్షులు కృష్ణమూర్తి

కాశీబుగ్గ: పలాస, కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు పరిసర ప్రాంతాలలో ఉన్న కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని కాష్యూ, రైస్ మిల్లర్స్ లేబర్ యూనియన్ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి అన్నారు. పలాసలోని కార్మిక భవనం వద్ద కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో ఎక్కువ మంది కార్మికులు ఉన్నటువంటి సంఘాలలో పలాస జీడి కార్మికుల సంఘం మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ సంఘం ఏర్పడి 47 ఏళ్లు పూర్తి చేసుకుందని అన్నారు. కార్మికులు సంక్షేమానికి ప్రభుత్వం, పరిశ్రమదారులు అందరూ సహకరించాలని కోరారు. యాజమాన్యం బాగుంటే కార్మికుడు.. కార్మికుడు బాగుంటే యాజమాన్యం బాగుంటోందన్నారు. అన్నారు. జీడి కార్మికులకు మరో తొమ్మిది నెలల్లో కొత్త వేతనం అమలవుతోందన్నారు. కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ వర్తించేలా, గుర్తింపు కార్డులు, కనీస మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి సానా ఈశ్వరరావు, కోశాధికారి కోనారి రాము, పూర్వ అధ్యక్షులు బొంపల్లి సింహాచలం పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీ నాయకుడు 'డబ్బీరు' మృతి



డబ్బీరు భవానీ శంకర్ (ఫైల్)



ఆస్పత్రి వద్ద మాజీ మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 16వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు డబ్బీరు భవానీ శంకర్ (55) ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన ఇటీవల అనారోగ్య సమస్యతో బాధపడుతూ పలాస కిడ్నీ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతూ తుది శ్వాస విడిచారు. భవానీ శంకర్ ప్రస్తుతం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా, 16వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా, శిష్టకరణ సంఘ నాయకులుగా వ్యవహరిస్తున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఆస్పత్రికి చేరుకున్నారు.

# ముగిసిన సుదర్శన యాగం



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ప్రసాదరావు తదితరులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పీఎన్ కాలనీలోని వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయ ప్రాంగణంలో మూడు రోజులుగా నిర్వహించిన నరసింహ సహిత మహా సుదర్శన యాగం చామర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూర్ణాహుతితో ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఆలయ ధర్మకర్త పి.జగన్మోహనరావు మాట్లాడుతూ.. విశ్వశాంతి సంరక్షణ కోసం, అందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలనే సంకల్పంతో ఈ యాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగిందన్నారు. యజ్ఞంలో మూలమంత్ర హవనం, సుదర్శన సత్రం పారాయణం, పూర్ణోక్తి, మంగళ శాసనము, రిత్విక ఆచార్య బ్రాహ్మణ సన్మానం, ప్రసాద వితరణతో కార్యక్రమం పూర్తయ్యింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### సాగునీరు అందించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని నారాయణపురం కుడి కాలువ ద్వారా సాగునీరు అందించాలని మాజీ జెడ్పీటీసీ సనపల నారాయణరావు ప్రభుత్వాన్ని కోరారు. సాగునీటి సమస్యను సోమవారం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఎచ్చెర్ల మండలంలో 13 గ్రామాలకు చెందిన 7,175 ఎకరాలున్నాయని, సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. రైతులందరూ హాజరుకావాలన్నారు.